# ఉపాధి హామీ శ్రామికులకు ప్రభుత్వం నిర్దేశించిన వసతులు కల్పించాలి.

-పీసీసీ సభ్యులు ధరణాలకోట శ్రీను డిమాండ్



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జూన్ 02:** ఉపాధి హామీ శ్రామికులకు పని సమయంలో ప్రభుత్వం నిర్దేశించిన వసతులు కల్పించాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ధర్నాలకోట శ్రీను సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.ప్రత్తిపాడులోని మూరా వారి చెరువు, పుష్కర కెనాల్ సమీపంలోని పంట కాలువకు జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పార్టీ ఆదేశాల మేరకు మంగళవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఉపాధి పనులు జరుగుతున్న చోట ఉపాధి కూలీలకు ఎటువంటి వసతులు లేకపోవడం గమనించారు.ఎండ ఎక్కువుగా ఉన్నా టెంట్లు వేయలేదు.మందులు కూడా లేవు. కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయలేదు. ఎండల వల్ల కానీ ఆరోగ్య స్థితి వల్ల కానీ ప్రమాదం వాటిల్లితే ఎవరి భాధ్యత అని అధికారులను ప్రశ్నించారు.తక్షణమే ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం నిర్దేశించిన వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు.

పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# వాడపాలెంలో కిషోర్ బాలికలకు సైబర్ భద్రతపై అవగాహన

అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమానికి శ్రీకారం







**కొత్తపేట,పెన్ పవర్,జూన్ 2:**కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వానపల్లి సెక్టార్‌లోని వాడపాలెం గ్రామంలో మంగళవారం కిషోర్ బాలికల ఆరోగ్య, వ్యక్తిత్వ వికాసం, సామాజిక అవగాహన లక్ష్యంగా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఎ. గజ్జలక్ష్మి ఆదేశాల మేరకు సెక్టార్ సూపర్వైజర్ హిమశ్రీ ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సులు చేపట్టారు.

కిషోర్ బాలికల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రత్యేక సమావేశాల్లో భాగంగా ఈసారి పదో సెషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్‌ఫోన్, సెల్‌ఫోన్ వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలు, సామాజిక మాధ్యమాల ప్రభావం, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, వ్యక్తిగత సమాచార రక్షణ వంటి అంశాలపై బాలికలకు సమగ్ర అవగాహన కల్పించారు. డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూనే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు.అలాగే గ్రామం, పాఠశాల, సమాజంలో బాలికలు ఎదుర్కొనే వ్యక్తిగత, సామాజిక సమస్యలను గుర్తించి వాటిని ధైర్యంగా ఎదుర్కొనే విధానాలపై చర్చించారు. బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, విద్యాపట్ల ఆసక్తి పెంచుకోవడం వంటి అంశాలపై సూచనలు చేశారు.ఇదే సందర్భంగా బిల్లకుర్రు తరిట్ల వారి పేటలో “అంగన్వాడీ పిలుస్తోంది” కార్యక్రమాన్ని ప్రారంభించారు. జూన్ 1 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో అర్హులైన చిన్నారులను చేర్పించేందుకు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి అంగన్వాడీ సేవలు ఎంతగానో దోహదపడతాయని వివరించి, ఎక్కువ మంది పిల్లలను కేంద్రాల్లో చేర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్వైజర్ హిమశ్రీ, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది, కిషోర్ బాలికలు,గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# గోదావరి పుష్కరాలు-2027 ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష





- తాళ్ళరేవు, కాజులూరు ఘాట్ల అభివృద్ధికి ముందస్తు ప్రణాళికలు
- కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రత్యేక సమావేశం

**కాకినాడ, జూన్ 2 పెన్ పవర్:**రాబోయే గోదావరి పుష్కరాలు --2027ను విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన పనులు, మౌలిక సదుపాయాల కల్పనపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు మంగళవారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశంలో కాకినాడ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. పుష్కరాల సందర్భంగా ఇప్పటికే ఉన్న ఘాట్ల మరమ్మతులు, అవసరమైన చోట్ల విస్తరణ, కొత్త ఘాట్ల నిర్మాణం, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.ఘాట్ల అభివృద్ధిపై కలెక్టర్ ప్రత్యేక సమీక్ష.ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ జిల్లాలోని పుష్కర ఏర్పాట్లపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా తాళ్ళరేవు, కాజులూరు మండలాల పరిధిలోని గోవలంక, గోపులంక, పిల్లంక, పెదలంక పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులు, ప్రతిపాదనలపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గోదావరి పుష్కరాలు-2027ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించిన నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలతో పనిచేయాలన్నారు. భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, ఘాట్ల విస్తరణ, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రవాణా సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని సూచించారు.దేవాలయాలకు ఆనుకుని ఉన్న పుష్కర ఘాట్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఘాట్లకు వెళ్లే అప్రోచ్ రోడ్ల అభివృద్ధి, వాహనాల పార్కింగ్ స్థలాల గుర్తింపు, అవసరమైన సౌకర్యాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డీఆర్వో డా. తిప్పేనాయక్, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎండీ మతిన్, పంచాయతీరాజ్ ఎస్ఈ ఏవీఎస్ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు, డీటీసీ ఎన్. శ్రీధర్, ఆర్ అండ్ బి ఎస్ఈ జీ. కాంతు, అగ్నిమాపక శాఖ అధికారి సీహెచ్ కృపావరం,డీఎంహెచ్ఓ డా.నరసింహా నాయక్, ఐ అండ్ పీఆర్ డీడీ పి. తిమ్మప్ప,ఎస్బీ డీఎస్పీ సత్యనారాయణ తదితర శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# చలివేంద్రంలో ద్రాక్ష రసం పంపిణీ.



**ఆలమూరు, పెన్ పవర్,జూన్ 02;**మండలంలోని మడికి శివారు చిలకలపాడు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మంగళవారం ద్రాక్షరసం పంపిణీ చేసి, ప్రయాణికుల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గడిచిన 15 రోజుల నుంచి ఈ చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈరోజు కమిటీ సభ్యులమంతా ఉన్నతంగా ఆలోచించి ప్రయాణికులకు ద్రాక్ష రసం పంపిణీ చేయడానికి నిర్ణయించాం. అయితే మండపేట నుంచి మేడపాడు రోడ్డు, దుళ్ల నుంచి కడియం వెళ్లే ఈ రెండు ఆర్ అండ్ బి రోడ్డుల నిర్మాణంతో అటుగా వెళుతున్న ట్రాఫిక్ మొత్తం మండపేట మడికి ఆర్ అండ్ బి రహదారికి మళ్ళించారు. దీంతో రెట్టించిన ఉత్సాహంతో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు స్థానిక యువత అధిక సంఖ్యలో ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా యువత చేస్తున్న సహాయ సహకారాలను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

# గజ్జనపూడి ఉపాధి హామీ పథకంలో భారీ అవకతవకులు.







- అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్.
- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్న పలువురు శ్రామికులు.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జూన్ 02:**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం గజ్జనపూడిలో ఉపాధి హామీ పథకం భారీ అవకతవకలు జరుగుతున్నాయని, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అర్హులకు పనులు కల్పించకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని పలువురు ఉపాధి శ్రామికుల ఆరోపించడమే కాకుండా, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడంటూ పలువురు బహిరంగశీగానే ఆరోపిస్తున్నారు.పలువురు ఉపాధి శ్రామికులు తెలిపిన వివరాలు ప్రకారం ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతాలకు నిజంగా శ్రమించి పనిచేసే కూలీలకు బదులుగా, ఫీల్డ్ అసిస్టెంట్ తనకు సంబంధించిన బంధువులు, సన్నిహితులు, అనుచరులను ఆటోల్లో పనుల ప్రదేశాలకు తరలించి పని చేయకుండానే మస్తర్లు వేస్తున్నారని ఆరోపించారు.

పని వద్ద కొద్దిసేపు మాత్రమే ఉండి,హాజరు నమోదు చేయించికుని, అనంతరం వారిని తిరిగి ఇళ్లకు పంపిస్తున్నారని వాపోయారు. మండుటెండల్లో గంటల తరబడి కష్టపడి పనిచేస్తున్న నిజమైన కూలీలు తగిన వేతనం గుర్తింపు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు గ్రామస్తులు వాపోతున్నారు. కష్టపడ్డ వారికి,కష్టపడని వారికి ఒకే విధంగా వేతనాలు చెల్లించడం అన్యాయమన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్దేశపూర్వకంగా జాబు కార్డులను డిలీట్ చేయడమే కాకుండా,జాబ్ కార్డుల కోసం వచ్చిన కొంతమంది పేదలను వారి కులాల పేర్లతో అవమానకరంగా మాట్లాడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇటువంటి ప్రవర్తన ప్రభుత్వ సేవల స్ఫూర్తికి విరుద్ధమని, దీనిపై కూడా విచారణ జరగాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామంలో జరుగుతున్న ఈ వ్యవహారంపై సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ఫీల్డ్ అసిస్టెంట్ పై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.








# ఓటరు జాబితాల పటిష్టీకరణకు పార్టీ శ్రేణులు కృషి చేయాలి- మంత్రి వాసంశెట్టి సుభాష్





**రామచంద్రపురం/మంగళగిరి, పెన్ పవర్,జూన్ 2:** మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) వర్క్‌షాప్‌లో రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్స్ మరియు ఇన్సూరెన్స్ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎన్నికల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియ, ఓటరు నమోదు,ఓటరు జాబితాల పరిశీలన, పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ నాయకులకు సమగ్ర దిశానిర్దేశం చేశారు.

ఓటరు జాబితాల పటిష్టీకరణతో పాటు ప్రతి అర్హుడైన ఓటరు పేరు నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితాలు ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు.ఈ వర్క్‌షాప్‌లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్, ఎంపీ సానా సతీష్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల జాబితాల సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని పరామర్శించిన మురళీ కృష్ణంరాజు....



**శంఖవరం/రౌతులపూడి పెన్ పవర్ జూన్ 02 :-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం
రౌతులపూడి మండలం శృంగవరం గ్రామానికి చెందిన యలమంచిలి సత్యవేణి, అలాగే ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన జువ్వల శ్రీను కుమార్తె జ్యోతి శ్రావణి ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో గాయపడి కాకినాడ సూర్య గ్లోబల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నరసాపురం పార్లమెంటు పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు ఆసుపత్రికి వెళ్లి ఇద్దరినీ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించేందుకు డాక్టర్లతో మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నల్ల వెంకటేష్, జువ్వల రాజా తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ర్యాలిలో జనాభా గణన సర్వేను పరిశీలించిన అధికారులు





**ఆత్రేయపురం పెన్ పవర్ జూన్ 2:** ఆత్రేయపురం మండలం పరిధిలోని ర్యాలి గ్రామంలో జరుగుతున్న జనాభా గణన సర్వేను డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి టి.వి. రాజేశ్వరరావు, ఎంపీడీవో బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో గణన సిబ్బంది నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించి, నమోదు చేస్తున్న వివరాలను తనిఖీ చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి పూర్తి స్థాయిలో సమాచారం సేకరించాలని అధికారులకు, ఎన్యూమరేటర్లకు సూచించారు. ఏ ఇంటి వివరాలు కూడా మిస్ కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జనాభా గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి, ఖచ్చితమైన సమాచారం నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ ప్రణాళికల అమలుకు అవసరమైన గణాంకాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.వి.ఆర్.కె. రాజు, ర్యాలి పంచాయతీ కార్యదర్శి జె. సాయిరాం రెడ్డి, జనాభా గణన సూపర్వైజర్‌తో పాటు ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

## గూగుల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్" అనే అంశంపై రెండు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్



**గండేపల్లి, పెన్ పవర్, జూన్ 2:** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం నందు "గూగుల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్" అనే అంశంపై రెండు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభించినట్లు డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి తెలియజేసారు. ప్రస్తుత ఆధునిక విద్యా విధానం, పరిశ్రమల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యత గురించి అధ్యాపకులకు ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాంప్రదాయ బోధనా పద్ధతుల స్థానంలో సరికొత్త టెక్నాలజీని జోడించి బోధన, పరిశోధన, కంటెంట్ క్రియేషన్, కోడింగ్ మరియు డేటా అనాలిసిస్ వంటి రంగాల్లో అధ్యాపకులకు పూర్తి స్థాయి ప్రాక్టికల్ అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం. దీని ద్వారా క్లాస్‌రూమ్ టీచింగ్, విద్యార్థుల ప్రాజెక్ట్‌లలో, రీసెర్చ్ పబ్లికేషన్స్ లో ఈ టూల్స్‌ను సమర్థవంతంగా ఉపయోగించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ముఖ్య శిక్షకులు గా గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ లీడ్ మిస్ ఇషా పోర్వాల్, మరియు గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్ పార్ట్నర్ 'అప్ ఎడ్యుకేటర్' లీడ్ ట్రైనర్ మిసెస్ ఆర్తి కుమారన్ విచ్చేసి అధ్యాపకులకు ప్రయోగాత్మక శిక్షణ అందిస్తున్నారు. ఈ శిక్షణ ద్వారా లభించిన నైపుణ్యాలతో అధ్యాపకులు విద్యార్థుల మెంటరింగ్, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మరియు ఇన్నోవేషన్ యాక్టివిటీస్‌లలో గూగుల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్లను విజయవంతంగా అమలు చేయగలుగుతారని యూనివర్సిటీ ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్. రమాశ్రీ, ప్రో వైస్-ఛాన్సలర్ (ఇంజనీరింగ్ ఒ సైన్సెస్) డాక్టర్ రమేష్ ఆదిరెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం హెడ్ డాక్టర్ మాకినీడి రాజా బాబు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. కర్ణం శ్రీను, మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీ లో ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభం






**గండేపల్లి, పెన్ పవర్, జూన్ 2:** ఆదిత్య విశ్వవిద్యాలయం కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో నెక్స్ట్-జెన్ టీచింగ్: బ్లెండింగ్ పెడగోగి విత్ ఞూ× ఫర్ స్టూడెంట్ సక్సెస్ అనే అంశంపై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ (జూన్ 2 నుంచి జూన్ 6 వరకు) ఆన్లైన్ విధానంలో నిర్వహించబడుతోంది అని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి విభాగాధిపతి డా. ఎం. వంశీకృష్ణ, వైస్ ఛాన్సలర్ డా. ఎం.బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (ఇంజనీరింగ్ టెక్నాలజీ) డా. ఎ. రమేష్ , ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడమిక్స్) డా. రమాశ్రీ, ఇంజనీరింగ్ పాఠశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎ. వానతి ముఖ్య అతిథులుగా విచ్చేసి ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఆధునిక విద్యా వ్యవస్థలో కృత్రిమ మేధస్సు (ఞూ×) పాత్ర రోజురోజుకు పెరుగుతోందని, బోధనా విధానాలలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా విద్యార్థుల అభ్యాస ఫలితాలను మరింత మెరుగుపరచవచ్చు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఆధునిక బోధనా పద్ధతులు కృత్రిమ మేధస్సు (ఞూ×) సాంకేతికతతో సమన్వయం చేసి విద్యార్థులు అభ్యాస ఫలితాలు మెరుగుపరచడం. ఈ కార్యక్రమం ద్వారా అధ్యాపకులు ఞూ× ఆధారిత బోధన సాధనాలు, స్మార్ట్ క్లాస్ రూమ్ వ్యూహాలు, విద్యార్థుల నిమగ్నత పద్ధతులు మరియు తదుపరి తరం బోధనా విధానాల పై సమగ్ర అవగాహన పొందనున్నారు. ఇటువంటి ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ అధ్యాపకుల వృత్తిపరమైన అభివృద్ధి కి, విద్యా నాణ్యత పెంపుదలకు మరియు విద్యార్థుల విజయానికి ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అధ్యాపకులు భవిష్యత్తు తరగతి గదిలో అవసరాలకు తగిన నైపుణ్యాలను సంపాదిస్తారు అనే ఆశాభావం వ్యక్తం చేశారు.

## 132 కేవీ లైన్ల మరమ్మతులు

### నాలుగు మండలాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం



**కాజులూరు, పెన్ పవర్,జూన్ 2:** ఏపీ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో గొల్లపాలెం పరిధిలోని 132 కేవీ విద్యుత్ లైన్లకు మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 3వ తేదీ (బుధవారం) మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు కాజులూరు, కరప, తాళ్లరేవు మండలాలతో పాటు పెదపూడి మండలంలోని సంపర సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలు, పారిశ్రామిక సంస్థలు మరియు ఆక్వా సర్వీసులకు అవసరాన్ని బట్టి అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని అధికారులు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతు పనులను సురక్షితంగా, సమర్థవంతంగా పూర్తి చేయడానికి ఈ తాత్కాలిక అంతరాయం తప్పనిసరి అవుతోందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించి అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ కాకినాడ ఎలక్ట్రికల్ ఆపరేషన్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. ఉదయ భాస్కర్ కోరారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల పురోగతిని బట్టి ముందుగానో లేదా నిర్ణీత సమయానికో నిర్వహించబడుతుందని అధికారులు వెల్లడించారు.

## కిషోరీ బాలికల సాధికారతకు అవగాహనే ఆయుధం



**రావులపాలెం పెన్ పవర్ జూన్ 2:** రావులపాలెం గ్రామంలోని లిటిల్ ఫ్లవర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శక్తి సదన్ సురక్షిత హోమ్‌లో కిషోరీ బాలికల వికాస కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వేసవి సెలవుల శిక్షణా తరగతుల్లో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ సీడీపీవో గజలక్ష్మి బాలికలకు బాల్య వివాహాలు, బాల్య గర్భధారణ, లైంగిక వేధింపులు, ఇంటర్నెట్ ప్రభావం, సైబర్ నేరాలపై సమగ్ర అవగాహన కల్పించారు. నేటి సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు ఇటువంటి అవగాహన సదస్సులు ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం ఐసీడీఎస్ శాఖ ద్వారా మే 1 నుంచి జూన్ 9 వరకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో బాలికల అభివృద్ధి, రక్షణకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక వేసవి శిక్షణా తరగతులను నిర్వహిస్తోందని తెలిపారు. విద్య ద్వారా మాత్రమే బాలికలు స్వయం సమృద్ధిని సాధించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోగలరని ఆమె సూచించారు. ల్యాంప్ కోఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ మాట్లాడుతూ గుడ్ టచ్--బ్యాడ్ టచ్ గురించి బాలికలకు వివరించారు. ఏదైనా ఆపదలో చిక్కుకున్నప్పుడు సమీప అంగన్వాడీ కార్యకర్తలను సంప్రదించాలని, పిల్లల సహాయ హెల్ప్‌లైన్ 1098, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 నంబర్లను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ చంద్రకళ, హోమ్ సిస్టర్స్ సంగీత, ఆరోగ్య మేరీ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. బాలికల భద్రత, హక్కులు, వ్యక్తిత్వ వికాసంపై నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం వారికి ఉపయోగకరంగా నిలిచింది.

## వేలంకలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డి వాము దగ్ధం



**కిర్లంపూడి,పెన్ పవర్, జూన్ 02:** కిర్లంపూడి మండలం వేలంక గ్రామానికి చెందిన దోమాల కృష్ణజడ్జికి చెందిన గడ్డి వాము విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంగళవారం అగ్నికి ఆహుతైంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గడ్డి వాము పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న వెంటనే ప్రత్తిపాడు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే గడ్డి వాము పూర్తిగా కాలిపోయి భారీ నష్టం జరిగినట్లు గుర్తించారు. స్థానికులు కూడా మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ ఘటనలో రైతుకు గణనీయమైన ఆర్థిక నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతుకు తగిన పరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సంత జాతీయస్థాయి చిత్ర కళా ప్రదర్శన




**కాట్రేనికోన పెన్ పవర్ జూన్ 2:** క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ అఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సంత పేరిట పల్లె మనసుల బ్రతుకు చిత్రం అంశంతో జాతీయస్థాయి చిత్ర కళా పోటీలు, ప్రదర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు ఆకొండి అంజి తెలిపారు. ఆసక్తి కలిగినవారు ఈ నెల 10 లోపు తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఎటువంటి ప్రవేశ రుసుము లేదన్నారు. ఈ నెలాఖరులోపు గీసిన చిత్రం ఫోటో కాపీ అందజేయాలన్నా రు. ఆగస్టు ఒకటి, రెండు తేదీలలో హైదరాబాదులోని జవహర్లాల్ నెహ్రూ ఆర్ట్స్ గ్యాలరీలో ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రతిభ చూపిన వారికి 50 వేల రూపాయలు నగదు బహుమతులు ప్రత్యేక బహుమతిగా ఐదువేల రూపాయలు అందిస్తారన్నారు. కొత్త సినిమా ఆడియో ఆడియో రిలీజ్ రోజున సినీ ప్రముఖుల చేతుల మీదుగా అందిస్తామన్నారు. పాల్గొన్న వారికి జ్ఞాపిక ప్రశంసా పత్రం అందిస్తామన్నారు. వివరాలకు 9989325790 నంబర్ కు సంప్రదించాలన్నారు.

## జనార్దనస్వామిని దర్శించుకున్న హైదరాబాద్ భక్తులు




**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 02;** ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి వారి ఆలయాన్ని మంగళవారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు సాదర స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం ఆలయ అర్చకులు ఖండవిల్లి ప్రభాకరాచార్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఐదు వేల ఏళ్ల నాటి నారద ప్రతిష్ఠిత నవ జనార్ధన ఆలయాన్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

# పిండ లింగ నిర్ధారణ పరీక్షలపై కఠిన నిఘా

* నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలపై చర్యలు తప్పవు
* డా. కె.వి. సుబ్బరాజు



**కాకినాడ, జూన్ 2 ,పెన్ పవర్:** గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణ కోసం దుర్వినియోగం చేయకుండా స్కానింగ్ కేంద్రాలపై కఠిన నిఘా కొనసాగిస్తున్నామని డివిజనల్ ఇమ్మ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డా. కె.వి. సుబ్బరాజు తెలిపారు.
మంగళవారం కాకినాడ రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో ఎస్. మల్లిబాబు ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, డివిజన్ స్థాయి పీసీపీఎన్డీటీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డా. కె.వి. సుబ్బరాజు అధ్యక్షత వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలను లింగ నిర్ధారణకు వినియోగించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తేలితే పీసీపీఎన్డీటీ చట్టం ప్రకారం సంబంధిత వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు స్కానింగ్ కేంద్రాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.కాకినాడ డివిజన్ పరిధిలో గుర్తింపు పొందిన 118 స్కానింగ్ కేంద్రాలపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో రెండు డెకాయ్ ఆపరేషన్లు, 54 ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు.సమావేశంలో వివిధ స్కానింగ్ కేంద్రాల నూతన రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్, సిబ్బంది మరియు యంత్రాల చేర్పులు, కొన్ని కేంద్రాల మూసివేతలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి ఆమోదించారు.వాటిని తదుపరి అనుమతుల కోసం జిల్లా స్థాయి కమిటీకి పంపనున్నట్లు తెలిపారు.పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు సంయుక్తంగా గర్భిణీల ఇళ్లను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని చెప్పారు. చట్టవ్యతిరేకంగా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాలు, నమోదు కాని కేంద్రాలు లేదా అర్హత లేని వైద్యుల వివరాలు తెలిసిన వారు టోల్ ఫ్రీ నంబర్ 1800 425 3365 లేదా వాట్సాప్ నంబర్ 9494113365 కు సమాచారం అందించాలని కోరారు.ఈ సమావేశంలో జీజీహెచ్ రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎం.ప్రియాంక, డా.ఎం. కీర్తి ప్రియ,పిఠాపురం సీహెచ్‌సీ పీడియాట్రీషియన్,స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కె. సింహాద్రి, డీసీపీఓ సీహెచ్ వెంకటరావు,హెల్త్ ఎడ్యుకేటర్లు విజయలక్ష్మి, రాంబాబు, కృష్ణశేఖర్, వి. సుధాకర్, కె. కృష్ణప్రసాద్, డీవై డెమో, ఎల్. శృతి మానిటరింగ్ కన్సల్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ. వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కాకినాడ నగర పాలక సంస్థకు ప్రతిష్టాత్మక ఐఎస్ఓ ధృవీకరణలు



**నాణ్యమైన సేవలు, పర్యావరణ పరిరక్షణకు గుర్తింపుగా ఐఎస్ఓ 9001:2015, ఐఎస్ఓ కూడా 14001:2015 అవార్డులు**

**కాకినాడ, జూన్ 2 (పెన్ పవర్):**నాణ్యమైన పరిపాలన, ప్రజా సేవలు, పర్యావరణ పరిరక్షణలో విశిష్ట ప్రతిభ కనబరిచిన కాకినాడ నగర పాలక సంస్థ (కేఎంసీ)కి ప్రతిష్టాత్మకమైన 9001:2015 మరియు ఐఎస్ఓ 14001:2015 ధృవీకరణ పత్రాలు లభించాయి.హెచ్.వై.ఎమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ గుర్తింపును అందించగా, మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఐఎస్ఓ ప్రతినిధి నుంచి కాకినాడ నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ ధృవీకరణ పత్రాలను స్వీకరించారు.పౌర సేవల సమర్థవంతమైన అందజేత, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య నిర్వహణ, స్థానిక నిబంధనల అమలు, పర్యావరణ హిత విధానాల అమలులో కాకినాడ నగరపాలక సంస్థ చేస్తున్న కృషికి గుర్తింపుగానే ఈ ధృవీకరణలు లభించినట్లు అధికారులు తెలిపారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమిష్టి కృషి వల్లే ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు సాధ్యమైందని అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్థాయిలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు.
కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ, ఈ ధృవీకరణలు 2026 జూన్ 2 నుంచి 2027 జూన్ 2 వరకు చెల్లుబాటులో ఉంటాయని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, ఇంజనీర్లు, ఆరోగ్య శాఖ సిబ్బంది అంకితభావంతో పనిచేయడం వల్లే ఈ ఘనత సాధ్యమైందన్నారు. ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు నగరపాలక సంస్థ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.పి. సుధాకర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటరావు, ఎంహెచ్ఓ డా. పృథ్వీ చరణ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# రావులపాలెంలో కిషోరీ బాలికల వికాసం కార్యక్రమం





**రావులపాలెం,పెన్ పవర్,జూన్ 2:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గ్రామంలోని లిటిల్ ఫ్లవర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శక్తి సదన్ సురక్షిత హోమ్‌లో మంగళవారం కిషోరీ బాలికల వికాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణా తరగతులలో భాగంగా ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సీడీపీఓ ఎ. గజలక్ష్మి హాజరై బాలికలను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా బాల్య వివాహాల దుష్పరిణామాలు, యుక్తవయసులో గర్భధారణ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, లైంగిక వేధింపుల నుంచి రక్షణ,ఇంటర్నెట్ వినియోగంలో జాగ్రత్తలు, సైబర్ నేరాల నివారణ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.నేటి సమాజంలో బాలికలు వివిధ సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.ప్రభుత్వం బాలికల అభివృద్ధి, రక్షణ మరియు సాధికారత కోసం ఐసీడీఎస్ ద్వారా మే 1 నుంచి జూన్ 9 వరకు ప్రతి మంగళవారం,శుక్రవారం ప్రత్యేక వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ శిక్షణల ద్వారా బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందడంతో పాటు వారి హక్కులు, భద్రత, ఆరోగ్యం, విద్య ప్రాధాన్యతపై అవగాహన పెరుగుతుందని అన్నారు. విద్యే జీవితంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లే సాధనమని, ప్రతి బాలిక చదువుపై దృష్టి పెట్టి స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు.
ల్యాంప్ కోఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ మాట్లాడుతూ గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్ గురించి బాలికలకు వివరించారు.ఎలాంటి ఆపదలు ఎదురైనా భయపడకుండా సమీపంలోని అంగన్వాడీ కార్యకర్తలను సంప్రదించాలని, చిన్నారుల రక్షణ కోసం పనిచేసే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. అలాగే సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 1930 హెల్ప్‌లైన్‌ను వినియోగించాలని సూచించారు.
కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ చంద్రకళ, శక్తి సదన్ హోమ్ సిస్టర్స్ సంగీత,ఆరోగ్య మేరీ, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది,బాలికలు పాల్గొన్నారు. బాలికల భవిష్యత్‌కు ఉపయోగపడే అంశాలపై నిర్వహించిన ఈ అవగాహన సదస్సు వారికి ఎంతో ప్రయోజనకరంగా నిలిచింది.

# డీలర్లు వ్యవసాయ శాఖ సిబ్బంది క్యూఆర్ కోడ్ విధానంపై అవగాహన పెంచుకోవాలి.

* డీలర్లు,గ్రామ వ్యవసాయకులకు శిక్షణా కార్యక్రమంలో ఏ డి ఏ,ఎన్ దైవకుమార్



**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 02:**డీలర్లు,గ్రామ వ్యవసాయ సహాయకులు క్యూఆర్ కోడ్ ఆధారిత వ్యవస్థ నూతన ఈ పాస్ విధానంపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ శాఖ ఏ డి ఏ,ఎన్ దైవకుమార్ అన్నారు.మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి ఆధ్వర్యంలో మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో డీలర్లకు, గ్రామ సహాయకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా దైవకుమార్ మాట్లాడుతూ రైతులు ఫర్టిలైజర్స్ బుకింగ్ యాప్ ద్వారా ఎరువులను బుక్ చేసుకునే విధంగా యాప్ ఉంటుందన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా బుక్ చేసుకుని ఎరువులను మండలంలోని డీలర్ల వద్ద నుండి గాని, రైతు సేవా కేంద్రాల్లో గాని పొందవచ్చని తెలియజేశారు. ఈ విధానం వల్ల రైతులు ఎరువుల కోసం క్యూలో నిలబడవలసిన అవసరం లేదని, షాపుల వద్ద వేచి ఉండవలసిన పని లేకపోవడమే కాకుండా, ఎరువుల విషయంలో ఎటువంటి అవకతవకలకు ఆస్కారం ఉండదన్నారు. ఈ యాప్ విధానం ద్వారా ఎంత ఎరువులు అందుబాటులో ఉన్నాయో స్పష్టమైన సమాచారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎరువులు, విత్తనాలు,పురుగుమందుల డీలర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సేవలపై జిల్లా స్థాయి శిక్షణ

**చిన్నారుల సమగ్ర అభివృద్ధిలో ఏఐ వినియోగంపై అవగాహన**






**కాకినాడ, జూన్ 2 ,పెన్ పవర్:**జిల్లాలో ఐసీడీఎస్ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సేవలలో వినియోగించే లక్ష్యంతో జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎనేబుల్డ్ అండ్ ఎర్లీ చైల్డ్ హుడ్" అంశంపై ఒక రోజు జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో నిర్వహించారు.ఈ విషయాన్ని జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.హెచ్. లక్ష్మి తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ హాజరై శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రభుత్వ సేవల అమలులో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని, చిన్నారుల సంక్షేమం, పోషకాహార పర్యవేక్షణ వంటి రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం మరింత ఫలితాలను అందించగలదని పేర్కొన్నారు.
ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల సీడీపీఓలు, సూపర్వైజర్లు, అలాగే వైద్య ఆరోగ్య శాఖకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.ప్రస్తుత కాలంలో వివిధ రంగాల్లో విస్తృతంగా వినియోగంలో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను చిన్నారుల సమగ్ర అభివృద్ధి, పోషకాహార స్థితి పర్యవేక్షణ, ముందస్తు గుర్తింపు సేవలు, డేటా విశ్లేషణ, సేవల పర్యవేక్షణ, ఫలితాల మెరుగుదల వంటి అంశాల్లో ఎలా వినియోగించవచ్చనే విషయాలపై నిపుణులు అవగాహన కల్పించారు.
అదేవిధంగా చిన్నారుల మేధో, శారీరక, సామాజిక, భావోద్వేగ వికాసానికి సంబంధించిన ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ డెవలప్‌మెంట్ (ఈ సి సి డి) అంశాలపై సైతం సమగ్ర శిక్షణ అందించారు.
ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల సంక్షేమ సేవలను మరింత ప్రభావవంతంగా అందించేందుకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సేవల నిర్వహణలో నూతన విధానాలపై అధికారులు అవగాహన పెంపొందించుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

# కిషోర వికాసం సద్వినియోగం చేసుకోవాలి





* ఐసీడీఎస్ సీడీపీఓ గజలక్ష్మి పిలుపు
* బాల బాలికలకు స్మార్ట్ ఫోన్లపై శిక్షణ

**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 02;**కిషోర బాల బాలికల సాధికారిత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టి కిషోర వికాసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఏ గజలక్ష్మి అన్నారు. కిషోర వికాసం-- వేసవి శిక్షణ భాగంగా ఆలమూరులో నిర్వహించిన కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. మే ఒకటిన ప్రారంభమైన ఈవేసవి శిక్షణలో భాగంగా బాలబాలికలకు స్మార్ట్ ఫోన్ వినియోగంపై సూపర్‌వైజర్లు కె.సత్యవేణి, బి,వరలక్ష్మితో కలిసి ఆమె అవగాహన కల్పించారు. ఇప్పటి నుంచే పొదుపు గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే బ్యాంకు ఖాతాల ఆవశ్యకత గురించి బాలబాలికలకు తెలియజేశారు. అనంతరం కిషోర వికాసం ఆవశ్యకతను వివరిస్తూ బారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో కిషోర్ వికాసం కార్యక్రమం జరిగింది. ఈనెల 12న జరిగే పిల్లల గ్రామసభతో ఈవేసవి శిక్షణ పూర్తవుతుందన్నారు. అంగన్‌వాడీలు సీహెచ్.సరోజారాణి, జి.లక్ష్మీకుమారి, జి.సూర్యకుమారి వి.ఆనందీకుమారి, ఎం.రామలక్ష్మి, డి.మణి, బి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆడారి సురేంద్రకు చదలవాడ బాబి పరామర్శ.



**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 2:** సీనియర్ జర్నలిస్ట్, ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ సభ్యుడు ఆడారి సురేంద్రకు కిర్లంపూడి సొసైటీ మాజీ చైర్మన్ చదలవాడ బాబి మంగళవారం పరామర్శించారు. ఆడారి సురేంద్ర ఇటీవల కాలంలో వెన్నుముక సంబంధించిన ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న చదలవాడ బాబి సురేంద్ర ఇంటికి చేరుకుని పరామర్శించడమే కాకుండా,ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు కిర్లంపూడి సొసైటీ మాజీ డైరెక్టర్ గండే గోపి, ఎల్లపు శివ, చిక్కాల కల్కి భగవాన్,ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉడతా అప్పారావు తదితరులు సురేంద్రను పరామర్శించిన వారిలో ఉన్నారు.

